
ప్రజాశక్తి

శనివారం 2 డిసెంబర్ 2023

5

విజయనగరం



వైద్య కళాశాలలో పోస్టులకు తాత్కాలిక మెరిట్ జాబితా

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వ వైద్య కళాశాలలో ఐదు విభాగాల్లో పలు పోస్టుల్లో నియామకాలకు సంబంధించిన మెరిట్ జాబితాను ఆన్ లైన్‌లో విజయనగరం జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలీల వెల్లడించారు. వైద్య విద్యాశాఖ డైరెక్టర్, జిల్లా సెలక్షన్ కమిటీ ఛైర్మన్ గా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 20 విభాగాల్లో 63 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. దీనిలో భాగంగా సైకియాట్రీ సోషల్ వర్కర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, క్లినికల్ సైకాలజిస్ట్, చైల్డ్ సైకాలిస్ట్ తదితర ఐదు విభాగాలకు సంబంధించి ప్రొవిజినల్ మెరిట్ జాబితాలను http://vizianagaram.ap.gov.in లేదా http://vizianagaram.nic.in తదితర వెబ్‌సైట్‌లలో పరిశీలించవచ్చని తెలిపారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు ఈనెల 4లోగా కళాశాల పనిదినాల్లో ఉదయం 10-30 నుంచి సాయంత్రం 5 గంటలలోగా తెలియజేవచ్చని పేర్కొన్నారు.



మందకొడిగా రబీ

వర్షాభావమే కారణం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో రబీ పంటల సాగు మందకొడిగా సాగుతోంది. వర్షాభావ పరిస్థితులే ఇందుకు కారణంగా కనిపిస్తున్నాయి. ఇదేపరిస్థితి కొనసాగితే వ్యవసాయ ఉత్పత్తులతోపాటు రైతుల ఆదాయం తగ్గిపోనుంది. ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తున్నామంటున్న చిరుధాన్యాల సాగు కూడా అంతమాత్రంగానే ఉండడం గమనార్హం. వాస్తవానికి రబీ సీజన్ అక్టోబర్ నుంచే ప్రారంభమౌతుంది. అంతకు ముందు ఖరీఫ్ సీజన్‌లో కురిసిన హెచ్చుతగ్గు వర్షాల వల్ల వరి విస్తీర్ణం తగ్గింది. నాటిన వరి కూడా చాలా వరకు ఎండిపోయింది. ఈనేపథ్యంలో వరిలో అంతరపంటగా వేయాల్సిన పెసలు, మినుములు తదితరాలు నాటడం సాధ్యం కాలేదు. రబీ సీజన్ ఇప్పటికే రెండు నెలలు గడిచింది. డిసెంబర్‌తో ముగియనుంది. ఇప్పటికీ పంటల సాగు నత్తనడకనే సాగుతోంది. జిల్లాలో సుమారు పాతిక రకాల పంటల సాగు సాధారణ విస్తీర్ణం 1,72,710 ఎకరాలుగా అధికారులు గుర్తించారు. ఇందులో వరి, మొక్కజొన్న, రాగులు, పెసలు, మినుములు, చెరకు, నువ్వులు, వేరుశెనగ, కూరగాయలు, పలు రకాల పండ్లు సాగుకావాల్సి వుంది. గత ఏడాది సుమారు 1.60లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఇప్పటి వరకు 6,390 ఎకరాల్లో మాత్రమే సాగు కనిపిస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో 2.21లక్షల ఎకరాలకు సాగునీటి వసతి ఉన్నట్టు అధికారిక లెక్కలు ఉన్నాయి. రబీలో సీజన్ నాటికీ ఈలెక్క గణనీయంగా తగ్గిపోతోంది. రబీ వరి సాధారణ సాగు 7,290 మాత్రమే కావడం ఇందుకు తార్కాణం. గత ఏడాది 2,155 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు నాట్లు పడలేదు. రబీలో అత్యధికంగా సాగవుతున్నది జొన్నలు, సాధారణ సాగు విస్తీర్ణం 53,495 ఎకరాలు కాగా, గత ఏడాది లక్ష్యానికి మించి 61,200 ఎకరాల్లో సాగయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 3,452 ఎకరాల్లో మాత్రమే సాగు కనిపిస్తోంది. మొక్కజొన్న 3,875 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేయగా ఇప్పటి వరకు ఒక్క ఎకరాలో కూడా నాటలేదు. నువ్వుల సాగు కూడా ప్రారంభం కాలేదు. మినుములు 2శాతం, పెసలు 3.30శాతం మాత్రమే సాగయ్యాయి. మిగిలిన పంటల సాగు మరీ అధ్వానంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులే ఇందుకు కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్‌లో 87.3 మిల్లీమీటర్ల వర్షపులోటు నమోదు కాగా, నవంబర్‌లో ఇప్పటి వరకు 82.4 మి.మీ వర్షపాతం లోటు కనిపిస్తోంది. దీంతో రబీలోనూ రైతులకు నిరాశే ఎదురౌతోందని స్పష్టమౌతోంది.

శారద కంపెనీ వద్ద ఉద్రిక్తత

- న్యాయం చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ఆందోళన



రోదిస్తున్న మహేష్ భార్య

ప్రజాశక్తి-కొత్తవలస

స్థానిక కంటకాపల్లి సమీపాన ఉన్న శారద కంపెనీ వద్ద శుక్రవారం ఉద్రిక్తత నెలకొంది. గురువారం కంపెనీలో ప్రమాదవశాత్తు తిమిడి గ్రామానికి చెందిన కార్మికుడు ధర్మరెడ్డి మహేష్ బాబు (32) మృతి చెందాడు. ఈ విషయాన్ని బయటకి పొక్కకుండా కంపెనీ యాజమాన్యం ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో మహేష్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తమకు న్యాయం చేయాలంటూ శుక్రవారం కంపెనీ వద్ద ఆందోళన చేపట్టారు. ఉద్యోగులను లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. మహేష్ కుటుంబానికి రూ.30లక్షలు పరిహారంతో పాటు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడు లక్షల రూపాయల నష్టపరిహారం, మృతుడి భార్యకు ఉద్యోగం, పెన్షన్ ఇస్తామని యాజమాన్యం తెలిపింది. అందుకు బాధిత కుటుంబీకులు అంగీకరించలేదు. మహేష్ కుటుంబానికి న్యాయం చేయాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. యాజమాన్యంతో జరిగిన చర్చలు విఫలమవ్వడంతో ఆందోళన కొనసాగించారు. సిఐ చంద్రశేఖర్ ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటు చేశారు.



శారద కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న మహేష్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు



బోటును ఒడ్డుకు చేరుస్తున్న మత్స్యకారులు

తీరంలో అప్రమత్తం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నాయి. మత్స్యకారులు బోట్లను ఒడ్డుకు చేరుస్తున్నారు. అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని తీరప్రాంతంలో అధికారులు అప్రమత్తమయ్యారు. శనివారం నుంచి మూడు రోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉందని తహశీల్దార్ భాస్కరరావు తెలిపారు. మండలంలో ఉన్న మత్స్యకార గ్రామాల విఆర్‌ఒలు, కార్యదర్శులు అప్రమత్తం కావాలన్నారు. మూడు రోజులపాటు సముద్రంలో వేట నిషేధ హెచ్చరికలు జారీ చేయాలన్నారు. తీరగ్రామాల్లో దండోరా వేయించి తుపాను హెచ్చరికను ప్రకటించాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించాలన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు అప్రమత్తమై, తుపాను తీవ్రతను బట్టి చర్యలు చేపట్టాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్తు సమస్య వచ్చే అవకాశం ఉందని, ముందస్తుగానే తాగునీరు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు.

7న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుల పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు ఈ నెల 7న జిల్లాలో పర్యటించనున్నట్టు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. తన పర్యటనలో భాగంగా ప్రజాపంపిణీ వ్యవస్థ నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం, అంగన్ వాడీల్లో పౌష్టికాహారం సరఫరా, పిఎం మాతృవందన యోజన తదితర కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తారని తెలిపారు. ఆయా ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షలు కూడా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు కొండవెలగాడ విద్యార్థులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు కొండవెలగాడ విద్యార్థులు ఎంపికైనట్లు పిఇటి పతివాడ శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల కర్నూలు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జీనపాటి దేవీశ్రీ 65 కేజీల విభాగంలో, వల్లూరి రమాదేవి 40 కేజీల విభాగంలో పాల్గొని బంగారు పతకాలు సాధించారు. జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు వారు అర్హత సాధించారు. త్రోబాల్ పోటీలకు అండర్-17 విభాగంలో ఎన్ని లోకేష్ అర్హత సాధించాడు. వీరిని జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, సర్పంచ్ గదల బంగారమ్మ, నాయకులు మొయిద అక్కోజి అభినందించారు.

యూనిట్ల స్థాపనపై దృష్టి పెట్టండి

డిఐఇపిసి సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

పరిశ్రమలకు సకాలంలో అనుమతులు జారీ చేయడంతోపాటు, యూనిట్ల స్థాపనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలిసమావేశం కలెక్టరేట్ సమావేశమందిరంలో శుక్రవారం జరిగింది. జిల్లాలో కొత్త పరిశ్రమలు, పారిశ్రామిక వాడల స్థాపన విస్తరణకు ఉన్న అవకాశాలను, భూముల కేటాయింపు, ఇతర అంశాలపై ఈ సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ పిఎంఇజిపి పథకం కింద ఇప్పటివరకు అనుమతులు మంజూరు చేసిన యూనిట్లను వెంటనే ప్రారంభింపజేసేందుకు కృషి చేయాలని కోరారు. దీనిపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. పరిశ్రమలు, ఎపిఐఐసి ఆధ్వర్యంలో పారిశ్రామిక వాడల స్థాపనకు పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడానికి తగిన చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. కొత్తవలస మండలం బలిఘట్టం, రెల్లి, పెదరావుపల్లి, కంటకాపల్లి గ్రామాల్లో ప్రతిపాదిత భూములను కేటాయించడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూముల మ్యుటేషన్‌పైనా, వివిధ పారిశ్రామిక క్లష్టర్ల ఏర్పాటుపై చర్చించారు. కంటకాపల్లి క్లష్టర్, భోగాపురం మండలం దిబ్బపాలెంలో పాడైపోయిన పైప్‌లైన్ అంశం, పిఎంఇజిపి, ఆసుపత్రులు, ఆరోగ్య పరీక్షా కేంద్రాల సెంటర్‌కు స్థలం కేటాయింపు, బీమాలిలో మామిడి తాండ్ర తయారీ క్లష్టర్, షాపింగ్ మాల్స్‌లో అగ్నిప్రమాదాల నివారణా చర్యలు, డిపిఐఐటి సర్వే, అర్థన్నపాలెంలో ఎంఎస్‌ఎంఇ పార్క్, టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు, వివిధ పరిశ్రమలకు భూముల కేటాయింపు అంశం, భూముల స్థితిలో మార్పులు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ ఆర్.పాపారావు, డిడి నాగేశ్వరావు, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు, పరిశ్రమల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రకు అపూర్వ స్పందన

'ఆడుదాం ఆంధ్రా'ను జయప్రదం చేయండి : వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజవర్గాల కేంద్రాల్లో జరిగిన వైసిపి సామాజిక సాధికారిత బస్సుయాత్రకు విశేష స్పందన లభించిందని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో రాజాం నియోజకవర్గాన్ని కలుపుకొని ఇప్పటికే ఎనిమిది నియోజకవర్గాల్లో సామాజిక సాధికార బస్సుయాత్ర పూర్తి చేసుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వాల మాదిరి మాటలకు పరిమితం కాకుండా జగన్ మోహన్ రెడ్డి రాజ్యాంగ స్ఫూర్తితో స్వతంత్ర సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా నిజమైన సామాజిక న్యాయాన్ని పాటించి పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ నెల నుంచి పరిపాలన రాజధానిలో కార్యకలాపాలు మొదలుపెట్టడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడా విశాఖకు తరలి రాబోతున్నారని తెలిపారు. డిసెంబర్ 15 నుంచి సచివాలయం స్థాయిలో జరగబోయే ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15 వేల సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమంలో క్రికెట్, కబడ్డీ, కోకో, వాలీబాల్ ,బ్యాట్మెంటన్ పోటీలు మొదటిగా సచివాలయ స్థాయి, మండల స్థాయి, నియోజకవర్గస్థాయి, చివరగా రాష్ట్రస్థాయిలో జరుగుతాయని తెలిపారు. ఈ ఆటల పోటీలకు మొత్తంగా 12 కోట్ల రూపాయలు నగదును బహుమతి రూపంలో రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. సమావేశంలో పలాస నియోజకవర్గ పరిశీలకు కె.వి సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

అంగన్వాడీ సమస్యల పరిష్కారానికి

నల్లరిబ్బన్లతో నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



నల్లరిబ్బన్లతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

సమస్యలు పరిష్కరించాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ లు అమలు చేయాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నల్ల రిబ్బన్లతో కార్యకర్తలు, ఆయాలు విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం తాము చేస్తున్న దశల వారి పోరాటాన్ని గుర్తించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే డిసెంబర్ 8 నుంచి నిరవధిక సమ్మె తప్పదని ఆమె హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

రామభద్రపురం : ఈ నెల 8 నుంచి అంగన్వాడీల సమస్యలపై చేపట్టే సమ్మెకు మద్దతు ఇవ్వాలని సిఐటియు నాయకులు బలస శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం ఆరికతోటలోని బిసి కాలనీ అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వం తాత్సారం చేస్తోందన్నారు. సమ్మెకు పూర్తి మద్దతు ఇస్తామని పిల్లల తరుపున తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు ప్రకటించారు. కార్యక్రమంలో హేమ, శ్రావణి, చిన్నమ్మ, రాధిక, యూనియన్ నాయకులు సత్యవతి, శాంతకుమారి, హంసవేణి పాల్గొన్నారు.

నేడు, రేపు బూత్ స్థాయిలో ప్రత్యేక శిబిరాలు

పెండింగ్ ఫారాలన్నీ వారం లోగా ఆన్‌లైన్ కావాలి : కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఓటరుగా నమోదు కావడానికి షిఫ్టింగ్ , తొలగింపు, మార్పుల కోసం ఆఖరి గడువు ఈనెల 9 అని, ఆ తర్వాత జరిగిన చేర్పులు గానీ, మార్పులు గానీ ఈ జాబితా లోనికి రావని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈనెల 2, 3 తేదీలలో ప్రతి పోలింగ్ బూత్ వద్ద స్పెషల్ కాంపెయిన్ జరుగుతుందని, ప్రతి బిఎల్ఒ ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు బూత్ వద్ద అందుబాటులో ఉంటారని ఓటరుగా నమోదు కాని వారు, మార్పులు కోరుకునేవారు , తొలగింపుల కోసం తగు దరఖాస్తులతో బూత్ వద్దకు వెళ్ళాలని కలెక్టర్ తెలిపారు. ఈ విషయంపై వాలంటీర్ ద్వారా ప్రతి గ్రామం లో అందరికీ తెలిసేలా ప్రచారం చేపట్టాలని తెలిపారు. శుక్రవారం తహశీల్దార్లు, ఎన్నికల సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మాట్లాడారు. స్పెషల్ కాంపెయినలో ఇఆర్‌ఒలు ప్రతి బూత్ ను తనిఖీ చేయాలని, ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు బిఎల్‌ఒలు బూత్ ల వద్ద ఉండాలని, ఏ క్షణంలో లేకపోయినా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలిపారు. ఓటర్లలో 18,19 ఏళ్ల వారి సంఖ్య 8 వేల వరకు పెరిగిందని, ఇంకా 2 వేల దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయని, అయితే మరో 20 వేల వరకు అర్హులైన వారు ఉన్నారని తెలిపారు. ఇఆర్‌ఒ లు అన్ని కళాశాలలను సందర్శించి దరఖాస్తులను తీసుకోవాలని తెలిపారు. ఈనెల 8లోగా వాటిని ఆన్‌లైన్ చేయాలని, అప్పుడు మాత్రమే ఈ జాబితాలో ఓటరుగా నమోదు అవుతారని తెలిపారు. సమావేశంలో జెసి మయూర్ అశోక్, డిఆర్‌ఒ అనిత, ఇఆర్‌ఒలు వెంకటేశ్వర రావు, నూక రాజు, దొర, సుధారాణి, ఎన్నికల సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకతతో వెరిఫికేషన్ చేయాలి



వినతి అందిస్తున్న టిడిపి నాయకులు

విజయనగరం కోట : విజయనగరం నియోజకవర్గంలో ఓటర్ల వెరిఫికేషన్ పూర్తి స్థాయిలో పారదర్శకతతో చేయాలని టిడిపి నాయకులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, బొద్దల నర్సింగరావు ఆర్‌డిఒను కోరారు. శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో మరణించిన వారి ఓట్ల తొలగింపు, డబుల్ ఎంట్రీలు, వలసవెళ్లిన వారు ఓట్ల ను పూర్తిగా తొలగించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా వాటర్ వెరిఫికేషన్ చేసి కొత్త జాబితాను రూపొందించాలన్నారు. డబుల్ ఎంట్రీలు, వలసలు, మరణించిన వారి ఓట్లు నియోజకవర్గంలో సుమారుగా 2000 పైగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇటువంటి ఓట్ల వలన దొంగ ఓట్లు వేయడానికి ఆస్కారం ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బంగారు బాబు పాల్గొన్నారు.

ఎపిఐఐసి జోనల్ మేనేజర్‌గా మురళీమోహన్

ప్రజాశక్తి-విజయనగరం

ఎపిఐఐసి జోనల్ మేనేజర్‌గా ఎం.మురళీమోహన్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ జెడ్‌ఎంగా పనిచేసిన యతిరాజు ఉద్యోగోన్నతి పొంది జిల్లా నుంచి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జోనల్ మేనేజర్‌గా నియమితులైన మురళీమోహన్, శుక్రవారం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని కలిసిన అనంతరం బాధ్యతలు చేపట్టారు.

జాతీయ స్థాయి సైన్స్ పోటీలకు ధర్మవరం విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం

31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలకు ఎస్.కోట మండలం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి బోజంకి భరత్ రూపొందించిన టీ కాఫీ శాండ్ ప్రాజెక్టు ఎంపికైంది. గుంటూరులోని కెఎల్ యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలలో 187 ప్రాజెక్టులు ప్రదర్శించగా భరత్ రూపొందించిన టీ కాఫీ శాండ్ జాతీయ స్థాయికి ఎంపికైనట్లు డిఇఒ బి. లింగేశ్వర్ రెడ్డి తెలిపారు. గైడ్ టీచరుగా పొట్నూరు శివాజీ వ్యవహరించారు. ఈ విద్యార్థిని ఆప్ కాస్ట్ మెంబర్ సెక్రటరీ అపర్ణ ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ బి. ప్రతాపరెడ్డి, డిఇఒ బి. లింగేశ్వర్ రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ ఎం.కృష్ణారావు , జిల్లా అకాడమిక్ కోఆర్డినేటర్ టి.రాజేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. మహేశ్వరరావు అభినందించారు .

ఆర్‌పి పట్నాయిక్‌కు ఘంటసాల స్మారక పురస్కారం

ప్రజాశక్తి-విజయనగరంకోట




ఆర్‌పి పట్నాయిక్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్‌పి పట్నాయిక్‌కు ఘంటసాల స్మారక పురస్కారాన్ని శుక్రవారం ఘంటసాల స్మారక కళాపీఠం అందజేసింది. శతాబ్ది గాయకుడు పద్మశ్రీ ఘంటసాల 101 జయంతి సందర్భంగా ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.భీష్మారావు ఆధ్వర్యంలో స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన 12 గంటలు నిర్విరామ ఘంటసాల స్వరాభిషేకం కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహ భరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్లే బ్యాక్ సింగర్ సౌజన్య , సాయి- పవన్ తదితర వర్ధమాన గాయకులు పాల్గొని అలనాటి ఘంటసాల ఆలపించిన మధుర గేయాలు ఆలపించారు. అనంతరం పురస్కార గ్రహీత ఆర్‌పి పట్నాయిక్‌కు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈశ్వర్ కౌశిక్, ఇతర ప్రముఖులు ఘంటసాల స్మారక పురస్కారాన్ని అందజేశారు. అనంతరం ఆర్‌పి పట్నాయక్ మాట్లాడుతూ తాను ఎవరి దగ్గరా సంగీతం శిష్యరికం చేయకపోయినా ఈ రోజున సంగీత దర్శకుడు అవ్వడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. సమాజంలో తన వంతు మార్పు కోసం ట్రిగ్గర్ అనే షార్టు ఫిల్మ్ చేశానని, ఇది సమాజం లో మార్పు తీసుకొస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు. ఇది ఆస్కార్ అవార్డ్‌కు క్వాలిఫై అయ్యిందని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథి విష్ణు మూర్తి, బుచ్చిబాబు, మేకా అనంతలక్ష్మి, అబ్బులు, డాక్టర్ వెంకటేశ్వరరావు, ఉమా మహేశ్వరరావు, కోశాధికారి వై.వివి.సత్యనారాయణ, కాపుగంటి ప్రకాష్, గోపాల్ రావు, బుచ్చి బాబు, సర్వేశ్వరరావు, తదితరులు పోల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

ప్రజాశక్తి-గజపతినగరం



రామస్వామి మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

పట్టణంలోని జాతీయ రహదారి పక్కన నిర్మాణంలో ఉన్న మూడంతస్తుల భవనంపై విద్యుత్ ఘాతానికి గురై శుక్రవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. జాతీయ రహదారి సమీపాన డి.నర్సింహులు ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. ఇందుకోసం పద్మనాభం మండలం కృష్ణాపురానికి చెందిన సుంకరి రామస్వామి(45) మరో ఇద్దరు కూలీలతో కలిసి మద్ది గ్రామం నుంచి ఇటుకుల లోడు తీసుకొచ్చాడు. ఇటుకను అన్‌లోడ్ చేస్తూ మూడంతస్తుల భవనంపైకి తరలిస్తుండగా, ఆ పక్క నుంచే వెళ్తున్న హైటెన్షన్ వైర్లు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి కూలీలు కేకలు వేయడంతో జనం అక్కడికి చేరుకుని సమాచారం పోలీసులు చేరవేశారు. రామస్వామికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పంచాయతీ అనుమతులకు విరుద్ధంగా భవనాలు ఇష్టానుసారం నిర్మించడం వలనే ప్రమాదానికి కారణంగా స్థానికులు ఆరోపిస్తున్నారు.


సూర్యలక్ష్మికి కళామిత్ర పురస్కారం

ప్రజాశక్తి-విజయనగరం కోట

కళా, సామాజిక సేవ, నాటక రంగంలో చేస్తున్న సేవలకు గాను నగరానికి చెందిన భోగరాజు సూర్యలక్ష్మికి కళా మిత్రమండలి రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారం అభించింది. కళా మిత్రమండలి తెలుగు లోగిలి ఒంగోలు 17వ వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా ఎన్టీఆర్ కళాక్షేత్రం ఈ పురస్కారాన్ని అందజేశారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జివి పూర్ణచంద్, కళా మిత్రమండలి డాక్టర్ నూనె అంకమ్మ రావు, చైర్మన్ తేళ్ల అరుణ, ప్రధాన కార్యదర్శి సింహాద్రి జ్యోతిర్మయి, ప్రముఖ సినీ గేయ రచయిత భువనచందర్ చేతుల మీదుగా పురస్కార ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సూర్యలక్ష్మి మాట్లాడుతూ కళా, సాహిత్య, నాటక రంగానికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. ఆమెకు పురస్కారం రావడం పట్ల జిల్లా కళాకారులు, సాహితీవేత్తలు, సామాజిక సేవకులు అభినందనలు తెలిపారు.



సూర్యలక్ష్మికి అవార్డు అందజేస్తున్న పూర్ణచంద్, తదితరులు



డెంకాడ.. సమ్మె నోటీసు అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఈ నెల 20 నుంచి సమ్మెకు దిగుతామని సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె నోటీసును ఎంఇఒకు శుక్రవారం అందజేశారు. కలెక్టర్ కార్యాలయం వద్ద 4న ఆవేదన దీక్ష చేపడుతున్నట్లు వారు తెలిపారు. మూడు నెలలుగా జీతాలు లేక నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు.

డెంకాడ : ఎంఇఒ వెంకటరమణకు సమగ్ర శిక్ష ఉద్యోగులు శుక్రవారం సమ్మె నోటీసు ఇచ్చారు. రెగ్యులర్ చేయాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, తదితర డిమాండ్లతో ఈ నెల 20 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు ఆ ఫెడరేషన్ జెఎసి నాయకులు భాస్కరరావు, శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, నాయుడు, సంతోష్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



వినతి అందిస్తున్న కెవిపిఎస్, సిపిఎం నాయకులు

దళితుల భూములకు పట్టాలివ్వాలని వినతి

ప్రజాశక్తి-బాడంగి

దళితులు తరతరాలుగా సాగుచేస్తున్న ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వాలని కెవిపిఎస్ నాయకులు రాకోటి రాములు కోరారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో డిటి శ్రీనివాస్‌కి వినతి పత్రం అందజేశారు. జిల్లాలో 45 ఏళ్లకు పైగా దళితులు ప్రభుత్వ భూమిని సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నారని, వారికి పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. డప్పు కళాకారులకు, చర్మకారులకు రూ.5 వేలు పింఛను ఇవ్వాలని కోరారు. వీటిపై ఈ నెల 11న చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సురేష్, ఎం.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి-చీపురుపల్లి

ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలకు సంబంధించి కరపత్రాలను ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో వైసిపి మండల అధ్యక్షులు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసరావునాయుడు, పట్టణ అధ్యక్షులు పతివాడ రాజారావు, వైసిపి యువ నాయకులు బెల్లాన వంశీకృష్ణ శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో అలజంగి సర్పంచ్ రఘుమండ త్రినాథ, ఎంపిటిసిలు గెరిడి రామదాసు, కోరుకొండ దాలయ్య, ముళ్ల పైడిరాజు, కో - ఆప్షన్ మెంబర్ మహమ్మద్ ముజకీర్, ఎంఇఒ బొత్స బిసినాయుడు, పీడీ కె.మురళి, సరూఫ్, చీపురుపల్లి నియోజకవర్గ సోషల్ మీడియా కో- కన్వీనర్ ప్రభాత్ కుమార్, పేకాపు ప్రసాద్, నాగచైతన్య పాల్గొన్నారు.

వావిలపాడులో పంట కోత ప్రయోగాలు


ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వావిలపాడు, నలబెల్లి గ్రామాల్లో ఎఒ యశ్వంత్‌కుమార్ ఆధ్వర్యాన పంటకోత ప్రయోగాలు చేపట్టారు. ఈ సందర్భంగా ధాన్యం దిగుబడిని అంచనా వేశారు. కార్యక్రమంలో ఎవ్ఒ పైడిరాజు, రైతులు పాల్గొన్నారు.

రామతీర్థం రహదారి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని రామతీర్థం పంచాయతీలో రహదారి సమస్య పరిష్కరించాలని బిజెపి నాయకులు బి.శ్రీధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం రామతీర్థం గ్రామాన్ని సందర్శించి, మురుగు కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు.



ధాన్యం కొనుగోలు కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రైతు భరోసా కేంద్రాల ద్వారా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేపడుతున్నట్లు వైసిపి నాయకులు కర్రోతు వెంకట రమణ తెలిపారు. శుక్రవారం మండలంలోని చంద్రంపేట సచివాలయంలో విఎఎ వేణు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. వరి నూర్పుల దగ్గర నుంచి ధాన్యం సేకరణపై వ్యవసాయ అధికారులతో అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్లను పొలాల్లోకి పంపించి ధాన్యం నమూనాలు సేకరించి నాణ్యత నిర్ధారించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వి.అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు వితరణ

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలో గొల్లుపాలెంలో అగ్ని ప్రమాద బాధితులకు మరువాడకు చెందిన వెన్నెల పూర్ణచంద్రరావు సమకూర్చిన వంట పాత్రలు, దుస్తులు, తదితర సామగ్రిని ఎంపిపి చల్ల చలంనాయుడు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పోతల రవణమ్మ, పిఎసియస్ గొల్లు సతీష్, మాజీ సర్పంచ్ ఎల్. సూర్యనారాయణ, పార్టీ నాయకులు తొత్తడి సత్తిబాబు,పోతల కన్నం నాయుడు, మూకల చల్లంనాయుడు పల్లి రఘు, తదితరులు పాల్గొన్నారు.

3న రావివలసలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని రావివలస గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల మూడో తేదీన నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో గుండెకి సంబంధించిన సమస్యలను వైద్యులతో ఉచితంగా పరీక్షించుకోవచ్చని చెప్పారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఈ శిబిరం నిర్వహిస్తున్నామని, మండల పరిధిలోని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

140 సారా ప్యాకెట్లు స్వాధీనం

ప్రజాశక్తి-విజయనగరం

నగరానికి చెందిన పోలిశెట్టి సత్యవతి నాటు సారా ప్యాకెట్లను రవాణా చేస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్ఇబి వన్‌టౌన్ సిఐ బి.మధుకకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె నుంచి 140 నాటుసారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా నాటుసారా తయారు చేసిన, రవాణా చేసినా, అమ్మినా వారిపై పీడీ యాక్ట్ కూడా పెడతామని తెలిపారు. ఎవరైనా నాటుసారా అమ్మితే 9440902362 కు సమాచారం అందించాలని కోరారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్



ర్యాలీలో పాల్గొన్న జెసి మయూర్ అశోక్, డిఎంహెచ్ఒ భాస్కరరావు, అధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎయిడ్స్ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన అవగాహనా ర్యాలీని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఆయన ప్రారంభించారు. ర్యాలీ మయూరి జంక్షన్, ఆర్ అండ్ బి జంక్షన్ మీదుగా జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా జెసి మయూర్ అశోక్ మాట్లాడుతూ, ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతీఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఈ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తత ప్రచారం చేయాలని సూచించారు. ముందుగా గుర్తించి, వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడితే, ఎయిడ్స్ ప్రాణాంతకం కాదని అన్నారు. జిల్లాలో 17 చోట్ల హెచ్ఐవి పరీక్షలను నిర్వహిస్తున్నారని చెప్పారు. ఎయిడ్స్ పరీక్షల ఫలితాలను రహస్యంగా ఉంచడం జరుగుతుందని, అందువల్ల ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. జిల్లాలో ఎస్.కోట, బొబ్బిలి, రాజాం ప్రాంతాల్లో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. ఇతర జిల్లాలతో పోలిస్తే, జిల్లాలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల సంఖ్య తక్కువేనని చెప్పారు. ఎయిడ్స్ నియంత్రణకు తీసుకున్న చర్యలు, అవగాహనా కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని జెసి తెలిపారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ కె.రాణి, ఇతర అధికారులు, సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశాలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

హెచ్ఐవి బాధితులతో సహపంక్తి భోజనం

హెచ్ఐవి బాధితులు, ట్రాన్స్ జెండర్ల పట్ల సమాజంలో వివక్షత పోగొట్టి సమాజంలో ఇతరులతో కలసి జీవించేందుకు అనువైన పరిస్థితులు ఏర్పరచే లక్ష్యంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని లెట్ కమ్యూనిటీస్ లీడ్ అనే నినాదంతో ఈ ఏడాది నిర్వహిస్తున్న సందర్భంగా జిల్లాలోని హెచ్ఐవి బాధితులు, ట్రాన్స్‌జెండర్లతో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు, జిల్లా క్షయ, కుష్టు, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కె.రాణి, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి డి.రమేష్ తదితరులు పాల్గొని వారితో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సమాజంలో వారూ ఒక భాగమే, వారికి సమాజం తోడ్పాటు వుంటుందని చెప్పేందుకే ఈ ప్రయత్నం చేశామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఆర్.అచ్యుత కుమారి, పాజిటివ్ నెట్‌వర్క్ సంస్థ ప్రతినిధి పద్మ, ట్రాన్స్‌జెండర్ల సంఘం అధ్యక్షురాలు మీనాకుమారి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువతకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. రెడ్ క్రాస్ సెక్రటరీ కె.సత్యం, రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ సి.హెచ్. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జనార్ధన నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ సుభా, యూత్ రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ ఎస్.రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, రెడ్ క్రాస్ జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి.గౌరీశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాడంగి : ఎయిడ్స్‌పై విద్యార్థులు అవగాహన ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఎయిడ్స్‌పై చైతన్యానికి, అవగాహనకు యువత సామాజిక మాధ్యమాలను వినియోగించుకోవాలని డాక్టర్ విశ్వనాథ్ సూచించారు. కార్యక్రమంలో ఎయిడ్స్ కౌన్సిలర్ భానుమూర్తి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శంకర్‌రావు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : కొండవెలగాడలో పిహెచ్‌సి వైద్యాధికారి ధనుంజయ్, శిరీష ఆధ్వర్యాన ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ : ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపల్ కిలపర్తి అప్పారావు ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పిఒ కె.బి.బాబు, అధ్యాపకులు మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ : ఎయిడ్స్‌లేని సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని పూసపాటిరేగ పిహెచ్‌సి వైద్యులు రాజేష్‌వర్మ, ప్రమీలాదేవి, లక్ష్మి సైజలా అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రమణ, ఉమాపతి, బంగారుబాబు, ఎఎన్ఎం అసిరితల్లి, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గజపతినగరం : హెచ్ఐవిపై అవగాహన అవసరమని గజపతినగరం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీష్ తెలిపారు. ఎయిడ్స్ డే సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వంగర : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా వివేక మాస్టర్ మైండ్ పాఠశాల విద్యార్థులు ప్రిన్సిపల్ బెవర ఈశ్వరరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చక్రపాణి, కొండేటి శ్రీనివాసరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : అవగాహనతో ఎయిడ్స్‌ను నివారించవచ్చునని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జెసి రాజు, వి.శ్రీహరి, కోశాధికారి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ బాలికల వసతి గృహంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, జాగ్రత్తగా ఉంటే నివారించవచ్చునని తెలిపారు.

మా భూములు కాపాడండి

ఎస్‌పికి అమకాం గ్రామస్తుల ఫిర్యాదు



ఎస్‌పి కార్యాలయానికి వస్తున్న అమకాం గ్రామస్తులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భోగాపురం మండలం పోలిపల్లి గ్రామానికి ఆనుకొని సర్వే 27 లో ఉన్న తమ భూములను తమకు అప్పగించాలని అమకాం గ్రామానికి చెందిన తిరుమల రెడ్డి వెంకటరావు, తామడ గౌరీ కోరారు. శుక్రవారం ఎస్‌పికి ఫిర్యాదు చేసేందుకు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ పోలిపల్లి గ్రామానికి ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 27లో సుమారుగా 45 నుంచి 50 ఎకరాల భూమి తమ కుటుంబ సభ్యులకు, తమకు ఉందన్నారు. ఈ భూమి రికార్డులను తారుమారు చేసి భూమిని కొల్లగొట్టేందుకు కొంతమంది పెద్దలు రాజకీయ అండతో ప్రయత్నిస్తున్నారని తెలిపారు. పోలిపల్లి మాజీ సర్పంచ్ కర్రోతు సత్యన్నారాయణ సహకారంతో తప్పుడు డాక్యుమెంట్లు రూపొందించి కబ్జా చేసేందుకు చూస్తున్నారన్నారు. ఇదే విషయంపై తమ వద్ద నున్న పక్కా ఆధారాలతో కోర్టు కెళ్లామని తెలిపారు. తప్పుడు ఆధారాలతో ఆక్రమించుకున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించిందని తెలిపారు. ఇవేవీ పట్టించుకోకుండా కర్రోతు సత్యన్నారాయణ సుమారుగా మూడు ఎకరాలు భూమిలో అక్రమ కట్టడాలను పాల్పడుతున్నారని ఆరోపించారు. వెంటనే ఎస్‌పి కలుగజేసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. వీరితో పాటు సర్వే నెంబర్ 27 లో భూములున్న కుటుంబాలు కూడా ఎస్‌పిని కలిశాయి.

సంక్షేమ పథకాలతోనే అభివృద్ధి



భోగాపురం... మాట్లాడుతున్న వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ

ప్రజాశక్తి-బొండపల్లి

పేదలకు సంక్షేమ పథకాలు అందించడం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపిపి చల్ల చలంనాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని అంబటివలసలో సర్పంచ్ శిరుపురపు కసవయ్య అధ్యక్షతన రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఇఒపిఆర్‌డి సిహెచ్.సుగుణాకరరావు గ్రామంలో లబ్ధిదారులకు అందజేసిన సంక్షేమ వివరాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నంనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు మహంతి రమణ, ఎంపిడిఒ వై.వి.రాజేంద్రప్రసాద్, ఎఒ మల్లికార్జునరావు, హౌసింగ్ ఎఇ బివి.రామరాజు, జెసిఎస్ మండల కన్వీనర్ పల్లి రఘు, పిఎసిఎస్ అధ్యక్షులు గొల్లు సతీష్ కుమార్, సర్పంచులు ఈదిబిల్లి కృష్ణ, శిరుపురపు ఆదినారాయణ, బొండపల్లి ఈశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు తాళ్లపూడి అప్పలనాయుడు, బండారు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


డెంకాడ : రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని జొన్నాడలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. వైసిపి జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, డెంకాడ మండల కన్వీనర్ సారిక గౌరీశంకర్, జొన్నాడ సర్పంచ్ కోరాడ రమణి కోటినాయుడు, ఎంపిటిసి దేవి మురళి, ఆకులపేట సర్పంచ్ సువ్వాడ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం : పేదలను ఆదుకోవడమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని రామచంద్రపేట సచివాలయ పరిధిలో ఆంధ్రకు జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మండలంలోని అనేక గ్రామాలలో అభివృద్ధి పనులు చేశారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదల కోసం పెట్టిన పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన అందరికీ పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుక్క అప్పన్న, రమణ, నందిగాం సర్పంచ్ గరే మురళి, చిన్నారావు, ఎంపిడిఒ అప్పలనాయుడు, ఇఒపిఆర్‌డి సురేష్, నాయకులు పాల్గొన్నారు.

రేగిడి : పేదల అభ్యున్నతే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్మోహన్ రావు అన్నారు. చాటాయవలస గ్రామంలో సర్పంచ్ గోవిందరావు అధ్యక్షతన మా నమ్మకం నీవే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు.. వీరితోపాటు పిల్లా గోవిందరావు, కిషోర్ కుమార్, లావేటి అప్పలనాయుడు, సురేష్ ఉన్నారు.

వేపాడ : మండలంలో నల్లబెల్లి గ్రామంలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిపి డి.సత్యవంతుడు మాట్లాడుతూ మరో ముఖ్యమంత్రి వస్తే సంక్షేమ పథకాలు ఆపేస్తారని, అందుకే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సిఎంను చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


రైతులకు పట్టాలు పంపిణీ



రైతులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

ప్రజాశక్తి-గజపతినగరం

స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో రైతులకు శుక్రవారం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య పట్టాలు పంపిణీ చేశారు. రైతులకు శాశ్వత భూహక్కు పథకం ద్వారా వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22ఎ జాబితా నుంచి తొలగించి అసైన్డ్ భూములకు శాశ్వత భూహక్కు కల్పించినట్లు తెలిపారు. గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు మండలాలకు సంబంధించిన 703 ఎకరాలను 1378 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. 44 మంది నిరుపేదలను గుర్తించి 28 ఎకరాలు పంపిణీ చేశామన్నారు. గజపతినగరం మండలంలో శ్రీరంగరాజపురం గ్రామానికి చెందిన 22 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ సాయిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.



వేపాడ.. ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ, గొంప వెంకటరావు, నాయకులు

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి-వేపాడ

వైసిపి నాలుగున్నరేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని సింగరాయి గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యాన బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల గురించి వివరించారు. వైసిపి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ తిరోగమనంలో పయనించిందన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం ద్వారా యువత, మహిళలు, రైతులతోపాటు బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందించవచ్చన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, నాయకులు జనపరెడ్డి ఈశ్వరరావు, గొర్లి నాగరాజు, సిరికి రమణ, సర్పంచ్ సేనాపతి లీలా అప్పారావు, మంచిన అప్పలసూరి, పల్లి ధనుంజయ, కె. పి. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి : మండలంలోని ఒంపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ ఇల్లాపు కృష్ణ ఆధ్వర్యంలో బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ పాల్గొని, కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు.

కందిపప్పు పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

కందిపప్పు పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. పట్టణంలో ఎండియు ఆపరేటర్లు కందిపప్పు పంపిణీ చేయకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో రేషన్ సరుకుల పంపిణీని సిఎస్ డిటి సాయికృష్ణతో కలిసి పరిశీలించారు. కందిపప్పు కార్డుదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందిపప్పు పంపిణీలో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు ఎండియు ఆపరేటర్లపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.



ద్విచక్ర వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ద్విచక్ర వాహనాలపై ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి-రామభద్రపురం

ద్విచక్ర వాహనాల రాకపోకలను ప్రత్యేక నిఘా విభాగంతో పరిశీలించనున్నట్లు ఎస్ఐ సురేంద్రనాయుడు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో సిబ్బందితో కలిసి పలు ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల చైన్ స్నాచర్లు చెలరేగి పోతున్నారని తెలిపారు. ద్విచక్ర వాహనదారుల రూపంలో వచ్చి ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని, ఆభరణాలు చోరీ చేస్తున్నారని తెలిపారు. వాహన నంబర్ ప్లేట్లు మార్చి తప్పించుకు పోతున్నారని చెప్పారు. వీటి నిరోధానికి తమ శైలిలో పరిశీలన చేస్తున్నామన్నారు. ప్రతీ వాహదారు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. నిబంధనల మేరకు నంబర్ ప్లేట్ ఉండాలని, ఇతరత్రా రాతలు, గుర్తులు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇతర రాష్ట్ర వాహనాలకు ఇక్కడి అనుమతి లేకుండా రోడ్లపై తిరిగే హక్కు లేదన్నారు. ఆ వాహనాలు పట్టుపడితే సీజ్ చేస్తామన్నారు.

ఇళ్ల పనులు ప్రారంభించకుంటే రద్దు



వేపాడ.. మాట్లాడుతున్న ఎంపిపి సత్యవంతుడు

ప్రజాశక్తి-వేపాడ

జనవరి 31లోగా జగనన్న ఇళ్ల పనులు ప్రారంభించకుంటే రద్దు చేస్తామని ఎంపిపి డి.సత్యవంతుడు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో హౌసింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న ఇళ్లను ప్రజాప్రతినిధుల సహకారంతో పూర్తిచేసే బాధ్యతను సచివాలయ సిబ్బంది తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ పట్నాయక్, తహశీల్దార్ ప్రసన్నకుమార్ ఇఒపిఆర్‌డి ఉమ, పిఆర్ జెఇ ఆలీ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ వి.దేవి పాల్గొన్నారు.

అధికారులతో సమావేశం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు ఆయన సూచించారు. సమావేశంలో ఎంపిడిఒ పట్నాయక్, తహశీల్దార్ ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

రామభద్రపురం : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో, లేఅవుట్లలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. మండలానికి మంజూరైన సుమారు 450 ఇళ్లను వచ్చే ఏడాది జనవరి నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. ఆ దిశగా లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు సమస్యలుంటే రెవెన్యూ, మండల పరిషత్తు, వైకెపి సమన్వయంతో పనిచేసి గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపిడిఒ రమామణి, హౌసింగ్ ఎఇ సింహాచలం నాయుడు, ఇఒపిఆర్‌డి వెంకటరమణ, ఎపిఎం రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.